క్లుప్తంగా

గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రీనివాస్



గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ ఎస్.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన మన్యం జిల్లా గలవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్ అనకాపల్లి జిల్లా తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వెళ్లారు. కాగా, పబ్లిక్ హెల్త్ స్టాఫ్ నర్స్‌గా కేవీఎస్ నారాయణమ్మ బాధ్యతలు స్వీకరించారు.

జిల్లా జడ్జిని కలిసిన జీవీఎంసీ కమిషనర్



జిల్లా జడ్జిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా న్యాయమూర్తి చిన్నమశెట్టి రాజును జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం మర్యాదపూర్వకంగా జిల్లా న్యాయమూర్తి కార్యాలయ చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీకి సంబంధించి న్యాయపరమైన అంశాలు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తిని కమిషనర్ కోరారు.

కాలభైరవస్వామికి విశేష అభిషేకాలు



కాలభైరస్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని భైరవ స్వామికి బుధవారం అభిషేకాలు చేశారు. అమావాస్యను పురస్కరించుకొని స్వామి వారికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దొడ్డి రమణ, మంత్రి మంజుల, రాఘవేంద్ర స్వామి, జానకి, దేవి, పద్మ, హిమజ, అనిత, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



మృతుడు మురళీ

కూర్మన్నపాలెం: మద్యానికి బానిసైన వ్యక్తి బుధవారం ఇంట్లో ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు అందించిన వివరాలు.. అగనంపూడి దరి దిబ్బపాలెంలో నివాసముంటున్న బొట్టా మురళీకృష్ణ (25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిత్యం మద్యం సేవిస్తూ పనిపాటా లేకుండా తిరుగుతుండడంతో మురళీ భార్య మూడేళ్ల కిందట అతన్ని విడిచిపెట్టి వేరుగా వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న ఆయన మద్యం సేవించి ఇంట్లో సీలింగుకు ఉరి పోసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి మూడేళ్ల పాప కూడా ఉంది. మురళీ సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మమ్మల్ని మోసం చేశారు

సఫాయి కర్మచారీ ఉద్యోగుల ఆవేదన

అగనంపూడి: జాతీయ సఫాయి కర్మచారీ కిందట తమతో పేరు వాహనాలు కొనుగోలు చేసి జీవీఎంసీ మోసం చేసిందని ఉద్యోగులు ఆరోపించారు. రుణాలు తీర్చాలని బ్యాంకర్లు తమల్ని వేధిస్తున్నారని, తమకు ఆత్మహత్యలే శరణ్యమని జీవీఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, మున్సిపల్ పరిపాలన శాఖ రీజనల్ డైరెక్టర్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్లకు ఫిర్యాదు చేశారు. పేరుతో జీవీఎంసీ అధికారులు జాతీయ సఫాయి కర్మచారీ పథకంలో చెత్త వ్యాన్ కొనుగోలు చేసిందని, లాభాలు ఉంటాయని నమ్మబలికి తమతో బ్యాంక్ రుణపత్రాల మీద సంతకాలు చేయించిందని ఆరోపించారు. అయితే జీవీఎంసీ ఆ బిల్లులు చెల్లించకపోవడంతో బ్యాంక్ తమను రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తూ నోటీసులు జారీ చేస్తుందనిబాధితులు కానాటి చిలకమ్మ, కానాటి నాగమణి, గుర్రాల దివ్య, సత్రబోయిన మంగ, కానాటి అప్పారావు ఫిర్యాదు చేశారు.

వాన.. హైరానా

- స్తంభించిన జనజీవనం
- అవస్థలు పడ్డ విద్యార్థులు, ఉద్యోగులు
- ఫుట్‌పాత్ వ్యాపారుల డీలా



చెరువును తలపిస్తున్న ఉక్కు కళావేదిక వద్ద ఆట స్థలం



చిత్తడి చిత్తడిగా మారిన పెదగంట్యాడ రైతు బజార్

పెదగంట్యాడ: వర్షం వదలడం లేదు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. జనజీవనం స్తంభించింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు. ఫుట్‌పాత్ వ్యాపారులు ఉసూరుమంటూ ఇంటిబాట పట్టారు. బుధవారం ఉదయం నుంచి ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతోపాటు చిరుజల్లులుగా ప్రారంభమైంది. తర్వాత ఏకధాటిగా కురిసింది. రోజు మొత్తం తెరిపివ్వకుండా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి.మండలంలోని నడుపూరు, రామచంద్రనగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. రెండు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

చినుకు పడితే అడుగు వేయలేం..

పెదగంట్యాడ రైతు బజార్‌లో వర్షం పడితే అడగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇటు వినియోగదారులు అటు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షపు నీరు బయటుకు పోయే మార్గం లేక అక్కడే నిలిచిపోయింది.

వర్షంతో చిత్తడిగా రోడ్లు



బురదమయమైన కణితి రోడ్డు





గాజువాకలో పలు రహదారులు చిత్తడిగా మారాయి. ఉదయం నుంచీ కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వివిధ చోట్ల అభివృద్ధి పనుల నేపథ్యంలో తవ్వేసిన రోడ్లపై గోతులు పడడంతో వర్షపునీరు నిలిచి పోయి అస్తవ్యస్తంగా మారాయి. చినగంట్యాడ వందడుగుల రోడ్, కణితి రోడ్, వుడా డబుల్ రోడ్‌లలోని గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు. జాతీయ రహదారిపై కుంచుమాంబ ఆలయం వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు అసౌకర్యానికి గురయ్యారు.

– గాజువాక





రేపు స్టీల్‌క్లబ్‌లో ‘భామలు-సత్యభామలు’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–1 స్టీల్‌క్లబ్‌లో శుక్రవారం భామలు- సత్యభామలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెమినీ టీవీలో కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా స్టీల్‌క్లబ్‌లో ఎపిసోడ్ చిత్రీకరణ జరగనుంది. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు 89779 17044 నంబర్‌ను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని స్టీల్‌క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ కోరారు.

ఎమర్జెన్సీతో తీరని నష్టం



నారాయణరావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: ఎమర్జెన్సీ కాలంలో జైలు శిక్ష అనుభవించిన సుంకర నారాయణరావును బీజేపీ నాయకులు సత్కరించారు. గాజువాక బీజేపీ నాయకులు బుధవారం ఎమర్జెన్సీ వ్యతిరేక దినం నిర్వహించారు. ఆ పార్టీ నాయకుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. ఇందిరా గాంధీ హయాంలో అన్ని వ్యవస్థలు దగా పడ్డాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పౌరుడికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బొండా ఎల్లాజీరావు, బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, శశిధరణ్‌పిళ్లై, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాకు విశిష్ట ప్రాధాన్యం



బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు రామకోటి, రాములను సత్కరిస్తున్న సూపరింటెండెంట్ గోపీకృష్ణ

అగనంపూడి: యోగా విశిష్టత, ప్రాధాన్యతను వివరిస్తూ అగనంపూడి, లంకెలపాలెం పరిసర ప్రాంతాల్లో బ్రహ్మకుమారీస్ సంస్థ చేసిన కృషి అభినందనీయమని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ అన్నారు. 85వ వార్డు అగనంపూడిలోని బ్రహ్మకుమారీస్ భవనంలో నెలన్నర పాటు గ్రామస్తులు, విద్యార్థులు, ఆస్పత్రుల్లో విస్తృత అవగాహన, ప్రచారం చేపట్టిన యోగా గురువులు బీకే రామకోటి, బీకే రాము, బీకే రాజును ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా అగనంపూడి, లంకెలపాలెం ప్రాంతంలో యోగ, ధ్యానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బీకే రామకోటి మాట్లాడుతూ యోగా నిత్యజీవితంలో భాగమన్నారు. నిరంతరం సాధన చేయడం ద్వారా జీవిత కాలం రెట్టింపు కావడంతోపాటు అనారోగ్యాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మానందం, అగనంపూడి జూనియర్ కళాశాల అధ్యాపకుడు సూర్య శంకరరావు, బి.శ్రీనివాసరావు, నాయుడు, చిత్తా రామారావు, పూడి సత్యానారావు, బండారు రమేష్, సత్యవతి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ జీఎంకు సత్కారం



స్టీల్‌ప్లాంట్ జీఎం కామేశ్వరరావును సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ బి. కామేశ్వరరావును స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు సత్కరించారు. కామేశ్వరరావు ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా బుధవారం నాయకులు ఆయన్ను కలిసి పూలమాల వేసి గజమాలతో అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కామేశ్వరరావు చిన్న స్థాయి అధికారిగా స్టీల్‌ప్లాంట్‌లో చేరి స్వయంకృషితో జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ విభాగం అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన శేష జీవితం ఆనందంగా గడవాలని నాయకులు ఆకాంక్షించారు. ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్ది అప్పలరాజురెడ్డి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో పి.వి. రమణమూర్తి, బి.ఎస్. రాజు, కొమ్ము ప్రసాద్, వెంకన్న, రఘు, నిరంజన్, పి.అప్పలరాజు, వి. ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న శిష్టకరణ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: గుండెపోటుతో అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కె.శ్రీనివాసరావు కుటుంబానికి దువ్వాడ, రాజీవ్‌నగర్, కూర్మన్నపాలెం శిష్ట కరణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందించారు. శ్రీనివాసరావు అసోసియేషన్‌లో చురుగ్గా సేవలు అందిచేవారని, అలాంటి వ్యక్తి అనారోగ్యంతో ఇంటికి పరిమితం కావడంతో బియ్యం, ఇతర వంట సామగ్రి అందించామని అసోసియేషన్ ప్రతినిధులు శేఖరమంత్రి శ్రీనివాసరావు, బి.వి.ఎం.కృష్ణ, ఎం.ఎస్.ఎస్. శ్రీనివాస్ పట్నాయక్ తదతరులు పేర్కొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: యువత మాదవ ద్రవ్యాలకు దూరంగా.. ఉజ్వల భవితకు బాటలు వేసే విద్య దగ్గరగా ఉండాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు బుధవారం కృష్ణా కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 15 రోజులుగా కళాశాల విద్యార్థులకు సెమినార్, పోస్టర్ పెయింటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ మాదక ద్రవ్యాల వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుని వాటికి బానిసలుగా మారిపోవడం వల్ల యువత భవిష్యత్ చిత్తవుతుందన్నారు. యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు ఉన్నత భారత అభియాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.రామారావు, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సాయికృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఎం.బాలకృష్ణ, డాక్టర్ కె.రవిబాబు, రాజారావు డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను నిలదీద్దాం



పూర్ణానందశర్మను సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: కూటమి సర్కారు వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు హామీల అమలుకు ప్రజల తరపున నిలదీద్దామని 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. అగనంపూడిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూర్ణను స్థానికులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నట్టేటముంచిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. ప్రభుత్వ మోసాలను ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి సన్యాసిరావు, కరణం శ్రీను, సేనాపతి నరసింగరావు, పట్టా రామకృష్ణ, ఇల్లపు పెంటారావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘బెస్ట్ అవైలబుల్ స్కూల్’ విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలివ్వాలి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత హక్కుల సంఘం నాయకులు, తల్లిదండ్రులు

ఆరిలోవ: బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం ఇవ్వాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ జోగారావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈవో కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో తమ పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని, యూనిఫారం, పుస్తకాలు అందజేయాలని నినాదాలు చేశారు. అనంతరం జోగారావు మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కొనసాగించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో 10 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బకాయిలు ఉండటంతో పాఠశాలల యాజమాన్యాలు ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు ఆయా సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. అనంతరం డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై డీఈవో స్పందించి నగరంలోని భాష్యం, చలపతి తదితర స్కూళ్ల ప్రిన్సిపాళ్లను కార్యాలయానికి పిలిపించి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద పుస్తకాలు, యూనిఫారం అందించాలని ఆదేశించారు. పాఠశాలలకు ఉన్న బకాయిల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన జపాన్ ప్రతినిధులు



జపాన్ జెట్రో సంస్థ ప్రతినిధులకు ఏయూ ప్రగతిని వివరిస్తున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీని బుధవారం జపాన్ దేశానికి చెందిన జెట్రో(జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విద్యార్థులకు ఉపయుక్తంగా, లబ్ధిచేకూరేలా ఉండే నూతన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకునే దిశగా చర్చలు సాగించారు. వీసీ రాజశేఖర్ జెట్రో సంస్థ ప్రతినిధులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. పర్యటనలో భాగంగా నాస్కామ్ సెంటర్, డీన్ ఔట్రీచ్ విభాగాలను ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో జెట్రో తోయమ చిఫ్ తమురా కెన్, సీనియర్ డైరెక్టర్ జుంకి యమాపిట, డైరెక్టర్ జనరల్ కావోరు శిరయిపి, అసిస్టెంట్ డైరెక్టర్ వీర బాబు వీర్ల, డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ, రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో కీలక విభాగాల ప్రైవేటీకరణ దారుణం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కులో కీలకమైన విభాగాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలని నిర్ణయించడం దుర్మార్గమని సీఐటీయూ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతోనే ఉక్కు యాజమాన్యం ఈ తతంగాన్ని నడిపిస్తుందని ఆ యూనియన్ నాయకులు మండిపడ్డారు. కూర్మన్నపాలెంలో సాగుతున్న రిలే నిరాహారదీక్షల్లో బుధవారం పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కీలక విభాగాలు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం వల్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనివల్ల ఖర్చుపెరిగి నష్టాలకు దారితీసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగాన్ని రక్షిస్తామని గద్దెనెక్కిన నేతలు ఆ మాటలను విస్మరించి సంస్థ అమ్మకాలకు సహకరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రైవేటీకరణ విధానాలను తక్షణమే విడనాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమకు పట్టనట్టు వ్యవహరించకుండా కర్మాగార పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.రామరావు.కె.ఎమ్.,శ్రీనివాసరావు జగ్గారావు, పుల్లారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు స్థలం కబ్జాకు అడ్డుకట్ట



కబ్జాకు ప్రయత్నిస్తున్న స్థలం

గాజువాక: జీవీఎంసీ 69వ వార్డులోని కృష్ణ మహంతి చెరువులో కొంత స్థలం ఆక్రమించడానికి ఓ వ్యక్తి చేసిన ప్రయత్నానికి గాజువాక తహసీల్దార్ బి.శ్రీనివాస్ అడ్డుకట్ట వేశారు. చెరువును ఆనుకొని రోడ్డు నిర్మాణానికి పూనుకున్నాడని, అందులో భాగంగా గేటు కూడా ఏర్పాటు చేశాడని కొంతమంది స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన చెరువును పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న మేస్త్రీని మందలించారు. పని ఆపించి పంపించేశారు. మరోసారి పని చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాటర్ బాడీస్‌లో కబ్జాలపై తక్షణమే చర్యలు తేసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయని, ఎట్టి పరిస్థితుల్లోను ఆక్రమణలను అనుమతించబోమని ఈ సందర్భంగా తహసీల్దార్ పేర్కొన్నారు. ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వ్యక్తి వివరాలను తెలుసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు

కంచరపాలెం: సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించనున్న జాతీయ సమ్మెను మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. 54వ వార్డు 104 ఏరియా జ్యోతినగర్ సచివాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్మికులకు ఇంకా జీతాలు ఇవ్వకపోవడంపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. తక్షణమే మున్సిపల్ కార్మికులకు జీతాలివ్వాలని, కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పెర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు వేయకుండా, స్టీల్‌ప్లాంట్‌లో 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం ద్వారా ప్రజలను హింసించి నాటకాలాడుతోందన్నారు. జూలై 9న సమ్మెను జయప్రదం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తీవ్రమైన హెచ్చరిక జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, ఎం.నూకరాజు, రాయప్పడు, రమణమ్మ, ధనలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.